# వేట

అనఅనగా ఒక అడవి. అడవిలో అక్కడక్కడా అరుదుగా ఒకటో రెండో పెద్దపులులు.కాని అడివినిండా దండిగా తిరుగుతున్నాయి దోపిడి పులులు-ఫారెస్ట్ గార్డులు, దొంగ కంట్రాక్టర్లు, మాయ షావుకార్లు, యింకా....ఇలాటి అడివిలో ఓవారగా, కొండ పక్కగా, దీనంగా కోయగూడెం, గూడెం అంతటా పెనుచీకటిలా విస్తరించుకొనివున్నాయి, ఆకలి, అజ్ఞానం, భయం,చేతకానితనం.

దారిద్ర్యం తెచ్చిపెట్టిన యీతిబాధల్లో సతమతమై పోతున్న ఓకొండదొరకి ఓనాడు ఓపులి ఎదురైంది. ఏం తంటాలు పడ్డాడోగాని మొత్తానికి ఆపుల్ని చంపీగలిగేడు.

మెరుస్తున్న మచ్చల్తో నిగనిగలాడిపోతుంది పులి/ చర్మం. పులి చర్మాలకి బోలెడు గిరాకీవుందని తెల్సుకొండ దొరకి. అయితే దాన్నమ్మడం లాకాయిలూకాయి వ్యవహారం కాదని కూడా తెల్సు అతగాడికి. బహిరంగంగా బజార్లలో అమ్మడానికి వీల్లేని వస్తువుల్లో ఇదొకటి. ఇలాటివాటిని అమ్మాలంటే కంట్రాక్టర్ కనకరాజులు,షావుకారు సవ్రరాజులే గతి కొండవాళ్ళకి. కొండవాళ్ళని గుట్టుచప్పుడు కాకుండా గుటుక్కున మింగిపారేస్తున్న కొండచిలవల్లాంటివాళ్ళు యీ షావుకార్లు, కంట్రాక్టర్లు. ఈతకాయనిచ్చి యేజన్సీ సరుకుల్ని కొనేసి, ఆ సరుకుని పట్టికెళ్ళి పట్టాలంట పెనుతాటికాయంత ఖరీదుకి అమ్మడం వీళ్ళకి వెన్నతో పెట్టిన విద్య. ఈ మహవ్యాపారయజ్ఞానికి సమిధల్లాగ ఎవరెవరికి ఏయే కస్పీలు యివ్వాలో వీళ్ళకి కంఠోపాఠం.

తనదగ్గరున్న పులిచర్మాన్ని కంట్రాక్టరు కనకరాజుకి అమ్మజూపాలని నిశ్చయించుకున్నాడు కొండదొర. ఇంకా పొద్దుపొడవక మునుపేలేచిపోయి, బుక్కెడు వెదురుబియ్యం జావతాగి, పులి చర్మాన్ని చుట్టగాచుట్టి చంకలో పెట్టుకొని కంట్రాక్టరు దగ్గరికి బయల్దేరేడు. బయల్దేరేడేగాని గుబులుతో గుండెలు గుబగుబ లాడుతూనేవున్నాయి.తోడేళ్ళ మాదిరి అడివంతా ఆలంగం తిరిగేస్తున్న ఏ ఫారెస్టుగార్డు కళ్ళపడి పోతానేమో అనేభయం. ఈభయంవల్ల మనుషుల్తిరిగే మామూలుదారి ఒదిలేసి, డొంకల్నీ, కొండల్నీపట్టి కాళ్ళనీడ్చుకొస్తున్నాడు. ఏ ఆకుగలగల్లాడినా, ఏకొమ్మ ఫెళఫెళా వారిసినా, గాభరాపడిపోయి పిల్లిలా ఒదిగిపోతున్నాడు.

ఇంతలో గుట్టపక్కని చెట్టుమీంచి ఛెంగున గెంతిందో ఆకారం, ఆ ఆకారాన్ని చూస్తూనే నిలువునాకుప్పకూలిపోయాడు కొండదొర. ఆకల్తో అడివంతా తిరగ్గా తిరగ్గా ఓయెలకపిల్ల కళ్ళ బడితే, దానిమీదనే బుస్సుమని విరుచుకుపడ్డ చిట్లగొడ్డులా ఫారెస్టుగార్డు, భయంతో బిక్కచచ్చి

నిల్చున్న కొండ దొరమీద విరుచుకుపడ్డాడు.

"లంజికొడకా, పుల్ని సంపీసినావ్‌రా ? పెద్దపుల్నే ? హోరోరి తొత్తుకొడుకా, నిన్ను తిన్నగొట్టుకెల్ళి ఉరిదిబ్బెక్కించేస్తేగాని, మీకొండ నాకొడుకుల్కి గీరతగ్గదురా, లంప్డీకే అడివి జంతువుల్ని సంపకూడదని తెల్దురా? పద - పదరా నంజకొడకా ఫారెస్టర్ కాడికి పదరా, ఆడునిన్ను వురి దిబ్బకి తోలేస్తే అప్పుడాగిపోతాయి యీ పులుల్ని సంపడాలు, సింవ్వాల్ని సంపడాలున్ను - అందాక్కుదరవ్‌ర మీకీరోగాలు" అని సివంగిలా చిందుల్తొక్కేశాడు ఫారెస్టుగార్డు.

తదుపరి కొండదొర ఫారెస్టుగార్డు పాదాలమీద పడి పోవడం, వాడిజోళ్ళు కాళ్ళు నాకీడం, ఏడవడం, బతిమాల్డం యిత్యాది తంతులన్నీ సమిష్టిగానూ, ప్రత్యేకంగానూ జరిగేయి. చివరికెలాగో సమస్య పరిష్కారమయ్యింది. అవు తుందని యిద్దరికీ తెలుసు, ఒకడికి అంతాలాభంగానూ, మరొకడికి అంతా నష్టంగానూ. అయినా ప్రొసీజరు ప్రొసీజరే, బతిమాలుకోడాలు, బతిమాలించుకోడాల్చు, కసరడాలు, కసిరించుకోడాలు, తిట్టడాలు తిట్టించుకోడాలు - యీ ఫార్మాలిటీస్ ప్రకారం నడవక తప్పదు వ్యవహారం, ఇవన్నీ అయిపోయేక ఆఖర్న కుదిరేది బేరాలు, ఒప్పందాలు.

పులి చర్మం ఫారెస్టుగార్డు చేతిలోకి మారింది. అక్కడితో అయిపోలేదు కథ. కేసులేకుండా చేయ్యడానికి పులి తోలొక్కటే ఎలాసరిపోతుంది. ? సరిపోదు కనక, ఒకటోరకం వేపతేనె కూడా తెచ్చి సమర్పించుకుంటానని కొండవాడు విన్న వించుకున్నాడు గార్డుకి. ఈ తంతు ముగిసేక తూర్పు దిశగా వెళ్ళవలసిన కొండదొర మరి ముందుకు వెళ్ళవలసిన అవసరంలేక, వేదనతో వెనక్కి తిరిగిపోయి, కృంగిపోయిన సూర్యుడ్లా గూడెంపైపు బయల్దేరేడు.

అవతల ఫారెస్టుగార్డు లేడిరక్తం తాగిన పులిలా వుషారుగా గెంతుకుంటూ, తన క్వార్టర్స్ వైపు నడుస్తున్నాడు. అయితే పరిగెడ్తూ పరిగెడ్తూ శత్రువ్వాసన తగలగానే ఆగిపోయిన ఆడివి జంతువులాగ సడన్‌గా ఆగిపోయాడు. ముఖం లోకి ఏదో కంగారువచ్చేసింది. "ఫారెస్టర్ గాడు" తనమకాం దగ్గిరికి వచ్చేవేళయింది. ఆతొత్తుకొడుక్కి ప్రతిదాన్లోనీ వోటా కావాలి. ఏళకాని ఏళప్పుడు మకాంకాడికి పారొచ్చి నానా సెండాలం సేసెస్తన్నాడు" అని మనసులో అనుకున్నాడు ఫారెస్టుగారు. ఈమద్దినోనాడు వాడు క్వార్టర్స్' దగ్గిర కొచ్చి టైం‌లో, ఫారెస్టుగార్డు తన యిలాకా అయిన ఓ కొండ గుంట ఒళ్ళో తలపెట్టుకొని పేలు తీయించుకుంటున్నాడు, క్వార్టర్స్‌కి పక్కగా, రావిచెట్టు నీడలో, పిక్కలాంటి కొండ గుంట ఒళ్ళో తలపెట్టుకు పడుకున్న ఫారెస్టుగార్డ్‌ని చూసేటప్పటికి ఈర్ష్యతో కుతకుతవుడికిపోయేడు ఫారెస్టర్. దాంతో సర్రునలేచేడు. " రాస్కెల్ నాకు తెలీనివ్వకండాయివన్నమాట నీపన్లు, ఫారెస్ట్‌గొప్పనువుగాదొరికిందిరానీకు" అని తై తైమని గెంతేడు.

అరిచరిచి చివరికి " మొసలిపిల్లి నేతకొజుపిట్టని నోటకరిసి వొట్టికెల్ళిపోయినట్టు" అ కొండ పిల్లని గార్డుగాడి క్వార్టర్స్‌లోకి ఎత్తి కెళ్ళిపోయి, గడీపెట్టేసుకున్నాడు. పాపం తనింట్లోకి తనే వెళ్ళడానికి వీలుపడక యివతలే వుండి పోయేడుగార్డు.

ఇంతకీ చెప్పొచ్చే దేఁవంటే, ఫారెస్టర్ వుత్తి ఛండాలం ముండాకొడుకు. ఏది కంటబడినా, సిగ్గూ, లజ్జాలేకండా సొంతానికి లాగేసుకుంటాడు. అంచేత యిప్పుడీ పులిచర్మం గాని వాడికంటపడిందా, ఇకదానిపనంతే, గెద్దలాగ తన్నుకు పోతాడు. దీన్ని మూడోకంటివాడికి తేలీకండా షావుకారు సవరాజ్రగాడికి చూపిస్తే, ఏ కలకత్తాలో నోదాన్నమ్మించేసి తనకి వందో, రెండొందలో ముట్టచెప్తాడని వూహించి పొంగిపోతున్నాడు పారెస్టుగార్డు. బొంబాయి, కలకత్తా, డిల్లీల్లో డబ్బుతో పులిసిపోయిన వెధవలంతాయిప్పుడు తోళ్ళమోజులో పడిచస్తున్నారట. పులితోళ్ళకీ, పాముతోళ్ళకి, చివరకీ చెవలపిల్లి తోళ్ళకికూడా యమగిరాకీవుందట. సిరుంటే దేనికోముచ్చట్లు - డబ్బున్నోళ్ళ ముచ్చట్లన్నీ యిలాగేవుంటాయి. ఇంతగిరాకివున్న యీ పులితోలుగ్గాని అఫారెస్టర్‌గాడి కంట పడిందా.. ఇలా రకరకకాలుగా ఆలోచిస్తూ, అడుగులో అడుగు వేసుకుంటూ, గోర్జ మలుపుతిరిగి క్వార్టర్స్ దగ్గిరికి వచ్చిన పారెస్టుగార్డు, తనయెదురుగా పెద్దపులి నింపాదిగా నిలబడి నట్లయి త్రుళ్ళిపడ్డాడు.

క్వార్టర్స్ ముందున్న రావిచెట్టుకింద కూర్చోని. గుప్పుగుప్పున సిగరెట్టుపొగ వదుల్తున్న ఫారెస్టర్ యమభయంకరంగాకనిపించేడు. గార్డుని చూస్తూనే " రాస్కెల్, స్కాంద్రల్ "అంటూ విరుచుకుపడిపోయేడు.

ఆవలిస్తే అడివిని భక్షించీగల బుద్ధిమంతుడు గార్డు.ఫారెస్టుర్‌గారి వెర్రికోపానిక్కారణం యిట్టే గ్రహించీసేడు. క్వార్టర్స్ గోడపక్కని నక్కివున్న కొండగుంట తొంగితొంగి చూస్తోంది ఫారెస్టర్ పెడబొబ్బలు పెడుతూవుంటే. " ఇందుకా యీతొత్తుకొడుకు యిలాయెగిరిసస్తన్డు" అని మనసులో అనుకొని, బయటక్కనడకుండా మనసులోనే చిన్ననవ్వునవ్వు కున్నాడు.

" అడివిని సెకేసుకొచ్చీతప్పటికి, కసింతాలీసమైపోనాదిసార్" అని ఓ కుంటిసాకుని విసిరి, ఆదరాబాదరా క్వార్టర్స్ తాళం తీసేడు. హడావిడ్లో సెల్యూట్‌కూడా కొట్టలేదు. అయినా చంకలో పులితోలు చుట్టవుందికదా, సెల్యూట్ చేస్తే అదికాస్తాకిందిపడిపోయి, గుట్టురచ్చకెక్కదూ ?

అయితే, శారీరకమైన వాంఛతో మనస్సు ఎంతలా మెలికలు తిరిగిపోతున్నా, గార్డుగాడు నవ్వుకోడం, సెల్యూట్ చెయ్యకపోవడం గమనించలేనంత అచేతన స్థితిలోలేడు ఫారెస్టర్. తన ఎర్రని కళ్ళల్లోంచి ఒక ఎర్రని చూపుని గార్డుగాడి చంకలోవున్న తోలుచుట్ట మీదికీ విసిరి, " ఏట్రా అది నీ సంకలో" అని ఓగాండ్రింపు గాండ్రించేడు.

పులితోలుమీద ఆశ వొదిలేసుకున్నాడుగార్డ్. ఈగండం నుండి బయటపడితే అదేచాలని

రాయుఘుడా మజ్జిగైరమ్మకి మనసులోనే మొక్కుకున్నాడు. తదుపరి అమ్మవారికి కోడి పిల్లని సమర్పించుకున్నట్లు భయం భయంగా పులితోల్ని ఫారెస్టర్ చేతికందించేడు. దాన్నొక్కనిమిషం పరిశీలనగా చూసి, అగ్ని పర్వతంలా బుస్సునలేచేడు ఫారెస్టర్.

"అయితే రాస్కెల్ - వైల్డ్ లైఫ్‌ని ఫినిష్ చేయించేస్తున్నది నువ్వన్నమాట ! హారితొత్తుకొడకా! ఆఫీసర్లకి ఎంత బేడ్‌నేమ్ తెస్తున్నార్రా మీలాంటివాళ్ళు. మొన్నటికి మొన్న ఆ యెమ్మెల్యేగా డెవడో తిన్నగావెళ్ళి మినిష్టర్ కి చెప్పేశాట్టపారెస్టువాళ్ళంతా అడ్డవైన వాళ్ళతోనీ కుమ్మక్కయిపోయి వన్యమృగాల్ని దుళ్ళగొట్టేస్తున్నారని. ఆడికి అవకాశం వున్నాది, చీప్ పాప్యులారిటీకోసం నోటికొచ్చినట్టుల్లా వాగడానికి అని సరిపెట్టిసుకున్నాం అడి మాటలువిని. కానివాడు కుసిందాన్లో నిజంలేకపోలేదని యిప్పుడుతెలిసింది. ఇలాటి పందికొక్కు చేష్టలు చేసే నీలాంటి వాళ్ళూను, దానికి ప్రతి ఫలంగా దొబ్బులు కాసేది మేఁవూనా ? చెప్పు, చెప్పరారా స్కెల్ , ఈ పులిని చంపిన వెధవ దగ్గిర ఎంత కతికేవ్ ? ఇవాళే నీమీద వైల్డ్‌లైఫ్ కాన్సర్వేటర్‌కి రాసి, నీఅంతు తేలుస్తాను. ఎవిడెన్స్‌తో రెడ్ హేండెడ్‌గా దొరికేవ్‌కదా - ఇహ నిన్నెవడు రక్షిస్తాడో చూస్తాను. ఎంతకాలంనుంచీ చేస్తున్నావ్‌రా యిలాంటిపన్లు గాడిదకొడకా ? " అని ఘనాపాఠిలా పనసమొదలెట్టేడు.

ఉగ్రనరసింహావతారమెత్తిన ఫారెస్టర్ని శాంతింపచెయ్యడానికి గార్డు పడిన అవస్తలు చూస్తే "ఛీ, ఎందుకీ వెధవ జన్మ" అనిపిస్తుంది ఏ మాత్రం ఆత్మాభిమానంవున్న వాడికేనా. కాని వాడివుద్యోగం అటువంటిదిమరి-అందులో ఆత్మాభిమానాలు, మానాభిమానాలు యిత్యాది మాటలకి ఎక్కడా చోటులేదు. కొండగుంటతో పారెస్టర్ గారు మజాచెయ్యడానికి తన చేతుల్తో తానే స్వయంగా పక్కకూడా వెయ్యవలసొచ్చిందాపూట.

డిస్ట్రిక్టు ఫారెస్టాఫీసరుగారు గొప్ప పితృభక్తి పరాయణుడు. ఆయన తండ్రిగారు కమర్షియల్ టేక్సస్‌లో పని చేసి తన తదనంతరం ఓ అయిత్తరాలవాళ్ళు హాయిగా కూర్చోని తిండానికి అనువుగా వుండాలనే వుదాత్తాశయంతో కొంచెం డబ్బు సంపాదించేడు. రిటైరయిన మర్నాటినుండీ మాత్రం మహాసాధుపురుషుడైపోయి భజన్లు, జపాలు, తావళాలు తిప్పడాలు మొదటెట్టేడు. ఆయనోసారి సూచన ప్రాయంగా సిద్దులంతా ఎలా పులితోలు మీదనే కూర్చొని ధ్యాననిష్టలో కాలం గడుపుతారో చెప్పుకొచ్చేరు పుత్రరత్నం ముందు. అతనిమాటల్లో "నేనుకూడా సిద్ధ పురుషులకేం తీసి పోనుసుమా " అనేధ్వని స్పష్టంగావినిపించింది. ఇంకేంవుంది. పితృభక్తిపరాయణుడైన సదరు ఆఫీసురు తండ్రిగారు ధ్యాన నిష్టకి అన్ని విధాల సహాయపడే వుత్కృష్టమైన పులి చర్మంకోసం అడవులల్లా గాలించీడం మెదలెట్టేరు.

ఇదిగో యీ పులి చర్మాల గాలింపులో వున్నప్పుడే డిస్ట్రిక్టు పారెస్టాఫీసరు గారికి వీనులవిందైన

సమాచారం ఒకటి వినే ఛాన్సు తగిలింది. గండర గండడనే పేరు మోసిన మన ఫారెస్టర్ గారు కంట్రాక్టర్లతో లాలూచీపడి ఘనమైన గంధం చెక్కని, జాత్తైన టేక్కలపనీ దొంగతనంగా పొరుగు రాష్ట్రాలకి లాగించేస్తున్నట్టు అయనకి సమాచారం అందింది. త్రికాలజ్ఞులతో సమానమైన ధీశక్తికలిగిన డిస్ట్రిక్టు ఫారెస్టాఫీసరుగారు యీ దొంగవ్యాపారంలో ఫారెస్టర్‌కి ఎంత ముట్టివుంటుందీ అనేది సుళువుగా అంచనా వేయగలిగేరు. వేంటనే ఫారెస్టర్ని పిలిపించి పడచీవాట్లు పెట్టేరు. "నాకు తెలీకుండానే లాగించీగల్లను కుంటున్నావా ? ఖబడ్దార్, కాస్కోమజా ! నీ సంగతిచూస్తే పులికి తెలీకండానే పులి మీసాలు సవిరించీయాలనే తాపత్రయం కనబడుతోంది" అని ఓ బెదిరింపువిసిరి, అది ఫారెస్టర్ బుర్రలో యింకేదాకా వెయిట్‌చేసి, మరోముక్తాయింపువేశారు. "ఇలాంటి పనులల్లోకి మనం చొరపడేముందు ఎవరెవర్ని ఆకట్టుకురావాలో యింకా నీకు బోధపడినట్టులేదు.'' అని. ఈజ్ఞానబోధలోవున్న గూఢార్థం బహుసుళువుగా అర్థంవయింది ఫారెస్టర్ గార్కి.

అది లగాయతు డిస్ట్రిక్టు ఫారెస్టాఫీసరుగార్ని ప్రసన్నంచేస్కోడానికి ఫారెస్టర్ గారుపడుతున్న తంటాలు అన్నీ యిన్నీ కావు. అందులో ఓ భాగంగా తనుగార్డ్ దగ్గర్నుండి తస్కరించిన పులి చర్మాన్ని స్వయాన్న ఫారెస్టాసర్‌గార్కి సమర్పించుకున్నాడు. " మీఫాదర్‌గారు పూజా సమయంలో కూర్చోడానికి చాలా బాగావుంటుందిసార్'' అన్నాడుననుగుతూ. పులిచర్మాన్ని చూసి పులకించిపోయేరు, ఫారెస్టాఫీసరుగారి తండ్రిగారు. తనలోని పులే చచ్చిపోయి యిలా చర్మంగా మళ్ళీ తనముందుకొచ్చినట్టు ఫీలయేడు. ఆచర్మం మీద కుర్చోని, తావళం తిప్పుతున్నట్లు వూహించుకొని, మురిసిపోయేరు. కాని చర్మం యింకా చచ్చిన పులికంపే కొడ్తోంది. దాన్ని శుభ్రంగా పదునుచేసింతర్వాతగాని తపస్సుకి వాడ్డానికి వీల్లేదు. "మీకెందుకునాన్నగారు- దాన్ని ఫస్ట్‌రేట్‌గా బాగాచేయిస్తాను కదా" అని తండ్రిగార్కి ఎస్యూర్‌చేశారు ఫారెస్టాఫీసరు.

ఫారెస్టాఫీసరుగార్కి లౌకికజ్ఞానంతోపాటు, మంచి టేస్ట్ కూడావుంది. " నాటువాళ్ళకిచ్చి పదునుచేయండ్రా" అంటే ఆతోలుకివున్న బ్యూటీని కాస్త పాడుచేసి వదలిపెడ్తారు. అదీకాక, ఆచర్మాన్ని చుట్టుపట్లంటే పదునుచెయ్యడానికిస్తే యింకేఁవన్నావుందా - మొత్తం వ్యవహారఁవంతా కంపుకొట్టదూ? ఈ వన్యమృగ సంరక్షణ గోలకాదుగాని, చెవలపిల్లిని చంపినా చెవుల్తెంపి చేతులలో పెట్టేటట్టుగావుంది ప్రభుత్వం, అంచేత యీ పులితోల్ని తెలివితక్కువగా పీడికీవాడికీ యిచ్చి బాగుచేయించకూడదు. తను హైదరాబాదు వెళ్ళినప్పుడు స్వయంగా తనతోనేతీస్కెళ్ళి మంచి టేస్టుతెలిసినవాడి చేత"టేన్ ' చేయించాలి." ఈ రకంగా కేర్‌ఫుల్‌గా ఆలోచించి " పులితోలు స్ట్రేటజీని" తయారుచేసుకున్నారు డిస్ట్రిక్టు ఫారెస్టాఫీసరుగారు.

నిర్ణీత పథకం ప్రకారం త్వరలోనే హైదరాబాదు కేంప్ వేసుకొని, తనతో జాగ్రత్తగా పులితోల్ని

కూడాపట్టుకువెళ్ళారు ఆఫీసరుగారు. అయితే ఎంచేతనోగాని కొద్దిగా విధి వక్రించింది, ఆఫీసరుగారు అరెస్టయ్యారు. హైదరాబాదు ప్లాటుఫాంమీద, ఈయన్ని పట్టుకొవడానికి పోలీసులు చాలా పెద్దపథకం వేసినట్టు తరవాత ఫారెస్టుడిపార్టు మెంటువాళ్ళంతా కథలుగా చెప్పుకున్నారు.

అసలు దీనికంతటికీ వెనకాతల ఓ పెద్దగ్రంధంనడిచిందట. పోలీసాఫీసర్లకీ, యీ ఫారెస్టాఫీసర్కి వ్యాపారాల్లోనీ, వ్యవహారాల్లోనీ రాజీలు కుదరక నానా రకాలుగానూ అగ్గిరాజుకుంటోందట. వాళ్ళ పీకల్ని యీయన, యీయన పీకని వాళ్లు అవకాశం వొచ్చీరాంగానే కత్తిరించీడానికి కత్తుల్నూరుకొని తయారుగా కూర్చున్నారట. ఆ యుద్ధంలో భాగంగా యిప్పుడు డిస్ట్రిక్ట్ ఫారెస్టాఫీసరుగారు పోలీసుల కస్టడీలోకి వెళ్ళారట.

అయితే ఆయనకీ దుర్గతిదాపురించడానికి కారకులెవరు ? ఆయన పులితోలుతో ప్రయాణంచేస్తున్న సంగతి పోలీసుల కెలా తెలిసింది ?

ఈమధ్యనే పోలీసుగాచేరి, యింకా "పోలీసిజం" బాగా వంటపట్టని ఓ గిరిజన పోలీసు తన కులస్తుడైన గిరిజనుడుకి జరిగిన అన్యాయాన్ని పోలీసినస్పెక్టరుగారి చెవిని వేశాట్ట. మిష్టరీ మర్డర్‌కి గన్‌షాట్‌క్లూ దొరికినట్లయి కుర్చీలోంచి ఎగిరిగంతేశారట సర్కిల్‌గారు. ఫారెస్టువాళ్ళని ఓ పాతుపాతే డానికి యీభోగట్టా ఎంతవరకు పనికొస్తుందీ అన్నది అతగాడి ఆలోచన, ఇహనక్కడ్నుంచి నీళ్ళల్లో జాడల్ని వెతికే జాతి పులిలా, చడీచప్పుడు కాకుండా కూపీలు తియ్యగా తియ్యగా, పులితోలు ప్రస్తుతం డిస్ట్రిక్టు ఫారెస్టాఫీసరుగారి సంస్థానంలోనే వున్నట్లు, త్వరలో ఆయన హైదరాబాదువెళ్ళినప్పుడు దాన్ని పదునుచేయించ నున్నట్టు తెలిసింది. ఇంకేంకావాలి. పోలీసువాళ్ళకి? కావలసిన జంతువు మాటుకాసిన రేవుదగ్గిరికి మంచి నీళ్లు తాగడనికొచ్చి నట్టయింది. ఆఫీసరుగార్ని హైదరాబాదు లో అరెస్టు చేయిస్తే మాంచి డ్రమెటిక్‌గా వుంటుందనిపించి ఇన్ఫర్మేషన్ని హెడ్ క్వార్టర్స్‌కిచ్చి పన్న డిపించేరు పోలీసువాళ్లు. పోలీసు "ఖెడ్డా ఆపరేషన్"లో ఏనుగులా దొరికిపోయాడు, అడవులాఫీసరు, పులితోలుతోసహా. ఆ తోలుకి యింకా అక్కడా అక్కడా పూర్తిగా ఎండిపోని రక్తం మరకలు,గవులుకంపూ - యివే ఆయన కొంపతీశాయి పాపం. అతన్ని దొంగతనంగా వన్యమృగాల్ని వేటాడుతున్నందుకుగాని, లేదా అందుకు ప్రోత్సహిస్తున్న ఏజంట్‌గాగాని ఎందుకు పరిగణించకూడదో తెల్పవలసిందిగా అభియోగం. పాపం రైల్వే ప్లాట్‌ఫారంమీదనే యీ గొడవంతా జరగడంతో చుట్టూ పదిమందీ చేరి నానా రకాలుగానూ చెవులు కొరుక్కోడంతో ఫారెస్టాఫీసరుగార్కి తలకొట్టేసినట్లనిపించింది.

అయితే జరిగిన అవమానాన్ని మౌనంతో స్వీకరించి కూర్చొనే సాధుపుంగవుడేంకాదు అతగాడు. పోలీసులు యీరకంగా పబ్లిక్కుగా తనమీద కక్షతీర్చుకోడానికి నిర్ణయించుకుంటే,

తనేనా గాజులుతొడుక్కొని కూర్చున్నది? ప్రతీకార చర్యగా తనకున్న అర్థబలాన్ని రంగంలోకి దింపేరు. పెద్ద పెద్ద లెవెల్స్‌లో కుమ్ములాటలారంభమయేయి.

ఓ పేరున్న అమాత్యపుంగవుడిదాకా వెళ్ళింది కేసు. ఆయన ఎంతగానో విచారించేరు- జరిగిన సంగతులన్నీ విని. వివిధ శాఖల్లో పనిచేస్తూన్న ఆఫీసర్లు ఒకరితో వేరొకరు సహకరించుకోవలసిందిపోయి, యీ రకంగా పరస్పరం ద్వేషించు కోడాలు, కక్ష సాధింపు చర్యలకు దిగడాలు కడుంగడు శోచనీయం అని శలవిచ్చేరు అమాత్యశేఖరులు. రెండు పార్టీల వార్ని విడివిడిగా కల్సుకొని, వినవలసిందివిని, వెయ్యవలసిన చీవాట్లు వేసి, చెయ్యవలసిన బెదిరింపులు చేశారు. తదుపరి తన సమక్షంలోనే యిరుపక్షాలవార్ని సమావేశపరచి పోలీసువాళ్ళు, ఫారెస్టువాళ్లు కుమ్ములాడుకోడంవల్ల యేరకాలుగా నష్టాలు వస్తాయో సోదాహరణంగారుజూచేశారు. మరంచేత, వాళ్ళూ, వీళ్ళు తగూలుమానుకొని, ఒకరితో ఒకరు సహకరించుకుంటే ఎంత పురోభివృద్ధి సాధించవచ్చునో తెలియజేశారు.

మంత్రి గారి అపార జ్ఞానసంపదని చూసి యిరుపక్షాలవారు నిశ్శబ్దంగా గుండెలు బాదుకున్నారు. ఉపదేశాలు, వుద్ఘాటనలు, వుపన్యాసాలు అయినపిదప, మంత్రిగారు దరహాసం చేసి, సభలో వేంచేసివున్న యిరుపక్షాల్ని తిలకిస్తూ, ఇంతకీ ఆ పులితోలు యేది? అనడిగారు.

పోలీసులు అందించగా పుచ్చుకొని, పులితోల్ని మంత్రి గార్కి అందజేశారు ఫారెస్టాఫీసరుగారు. దాని సౌందర్యాన్ని బాగా మెచ్చుకున్నారు మంత్రిగారు. 'బాగుందయ్యా, చాలా బాగుంది. ఈకంపూ, రక్తం మరకలు పోయేట్టుచేసి...' పూర్తి చెయ్యలేదు వారు. అయినా ఆయన మనోభావం అందరికీ అర్థమయిపోయింది. మూడోనాటికి దాన్ని అత్యద్భుతంగా బాగుచేయించి, యిరుపక్షాలవారు జంటగా వెళ్ళి మంత్రిగార్కి సమర్పించుకుని "తమ వంటివారు పూజాసమయంలో దీని మీద కూర్చుంటే దివ్యంగా వుంటుంది" అని సన్నాయి నొక్కులు నొక్కారు.

(4-జూన్ 1981 - అవగాహన)

✪✪✪